సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 10 । మే । 2024



శ్రీవారి సేవలో ఎన్నికల పరిశీలకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు పర్దీప్ కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ ధింగార సందర్శించారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముదినేపల్లికి చెందిన భక్తుడు కె.రామకృష్ణ ప్రసాద్ రూ.1,00,000లను విరాళంగా అందజేశారు.




హమారా జగన్

ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీజేపీ నిర్ణయంతో కూటమికి ఎదురుగాలి వీస్తోంది. తామంతా సీఎం జగన్‌కు అండగా ఉంటామని ముస్లిం నేతలు అంటున్నారు. 8లో ▸

ఆయన రూటే సెపరేటు

నిమ్మల.. వసూళ్లు చాలా..

- ఎమ్మెల్యే ప్రచార ఆర్భాటానికి తమ్ముళ్ల జేబులకు చిల్లు
- కుర్చీల నుంచి ఫ్లెక్సీల వరకు భారం అంతా వారిదే
- కార్యక్రమానికి అయ్యే ఖర్చు నిర్ణయించేది ఆయనే..
- పార్టీ కార్యక్రమాలు, ట్రీగార్డుల పేరిట వ్యాపారుల నుంచి వసూళ్లు
- పర్సంటేజీల కోసం కాంట్రాక్టర్లపై ఒత్తిళ్లు
- పాలకొల్లులో ఎమ్మెల్యే రామానాయుడు బాగోతం



ఆయన వస్తున్నారంటే తమ జేబుకు ఎంత చిల్లు పడుతుందోనని అక్కడి తెలుగు తమ్ముళ్లు హడలిపోతారంట. పేరుకు ఎమ్మెల్యే అయినా పార్టీ కార్యక్రమాల ఖర్చులను కేడర్‌పై రుద్దుతారని, మీరు సహకరించాలంటూ వ్యాపారులనూ విడిచిపెట్టరని పేరు. గతంలో జరిగిన అభివృద్ధి పనుల్లో పర్సంటేజీల వ్యవహారం వివాదాస్పదమైనా.. ట్రీగార్డుల పేరిట వసూళ్లు చేసినా ఆయన రూటే సెపరేటని పేరొందారు పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు. – సాక్షి, భీమవరం/పాలకొల్లు సెంట్రల్

2014, 2019 ఎన్నికల్లో వరుసగా పాలకొల్లు నుంచి నిమ్మల రామానాయుడు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆయన పర్సంటేజీల వ్యవహారం పెద్ద రచ్చే అయ్యింది. పాలకొల్లులో పైసలిస్తేనే పనులు జరుగుతాయన్న ప్రచారం అప్పట్లో ముమ్మరంగా జరిగింది. 2018లో పట్టణంలోని దమ్మయ్యపతి మురుగుకోడు పనులకు సంబంధించి కమీషన్ వ్యవహారం తేలక కాంట్రాక్టర్‌కు అధికారుల ద్వారా బిల్లుల చెల్లింపులు నిలిపివేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి వేధింపులకు గురిచేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ తదితరులు జోక్యం చేసుకుని పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించి సదరు కాంట్రాక్టర్‌ను బయటకు తీసుకువచ్చారు. గోదావరి పుష్కరాల పనుల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఆయన అవినీతిలో లోకేష్‌కు వాటా ఇచ్చేవారని విమర్శలు ఉన్నాయి. సామ్మొకరిది.. సోకొకరిది అన్న చందాన అప్పట్లో మొక్కలను సంరక్షించే పేరిట దాతలు, వ్యాపారుల నుంచి వసూళ్లు చేసి తన పేరు వేయించుకున్నారంటారు.

టార్గెట్‌లు పెట్టి మరీ..

గతంలో పాలకొల్లులో నిర్వహించిన మినీ మహానాడుతో పాటు పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలు, చంద్రబాబు, లోకేష్ తదితర నాయకుల పర్యటనల సమయంలో వ్యాపారులు, రియల్టర్లు, బడాబాబులకు భారీగానే టార్గెట్‌లు పెట్టేవారని తెలుస్తోంది. ఆయనతో ఎందుకు వచ్చిన గొడవ అన్న ఉద్దేశంతో గుట్టుచప్పుడు కాకుండా అడిగిన కాడికి వారు చెల్లింపులు చేసేవారంటారు. మళ్లీ ఆయన అధికారంలోకి వస్తే వసూళ్ల వేధింపులు తప్పవన్న ధోరణిలో వ్యాపారులతో పాటు వివిధ వర్గాల వారు వ్యతిరేకంగా ఉన్నారని సమాచారం.

కార్యక్రమాల భారం కేడర్‌పైనే..

పార్టీ కార్యక్రమాలు పేరిట ఆయన ఏ గ్రామానికి, ఏ వార్డుకు వచ్చినా కుర్చీలు, జెండాలు, ఫ్లెక్సీలు, టిఫిన్లు, భోజనాలు తదితర ఖర్చులన్నీ స్థానిక నాయకులే భరించాలి. పార్టీ కార్యక్రమాలకు తక్కువనుకుంటే రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చయ్యేదంటున్నారు. ఫ్లెక్సీలు స్వయంగా ఆయనే డిజైన్ చేయించుకుని వాటినే ప్రింటింగ్ చేయించాలని, సైజులు కూడా ఆయనే నిర్ణయించేవారంటారు. అధికారంలో ఉన్నప్పుడు ఏదోక పని చేయించుకోవచ్చన్న ఉద్దేశంతో ఎంత ఖర్చయినా భరించేవాళ్లమని, పవర్ పోయినప్పుడు పాత ఒరవడి కొనసాగించడం తమ తలకు మించిన భారమయ్యేదని కేడర్ లోలోన మదనపడేవారని తెలుస్తోంది. ఆయన ప్రచార ఆర్భాటానికి తమ చేతి చమురు వదిలించేవారని ఆవేదన చెందుతున్నారంట.

బీసీలపై పుట్టుకొచ్చిన ప్రేమ

గతంలో బీసీ నేతలు ఎవరినీ ఎదగనీయకుండా అణగదొక్కే ప్రయత్నం చేసిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకి కొత్తగా వారిపై ఎనలేని ప్రేమ పుట్టుకొచ్చిందన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది. అందుకు అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపీ) బీసీ సామాజికవర్గానికి చెందిన వారు కావడమే కారణమంటున్నారు. బీసీ సామాజికవర్గం నుంచి గతంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీల నుంచి మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్ ఎమ్మెల్సీలుగా ఉండగా వారికి కనీస ప్రోటోకాల్ గౌరవం కూడా నిమ్మల దక్కకుండా చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. 2018లో పట్టణంలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ రామ్మోహన్‌ను ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడంతో పాటు కార్యక్రమానికి ఆహ్వానించని విషయమై జరిగిన వివాదాన్ని, ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీలకు ఇస్తానని చెప్పి క్షత్రియ సామాజిక వర్గానికి ఇవ్వడాన్ని బీసీలు చర్చించుకుంటున్నారు. పాలకొల్లు మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న కర్నేన రోజారమణి దంపతులను ఎమ్మెల్యే నిమ్మల ఎదగనీయకుండా అడ్డుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గోపికి వర్గాలకు అతీతంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆదరణ లభిస్తుండటంతో నిమ్మలకు ఓటమి భయం పట్టుకుని బీసీ జపం చేస్తున్నారని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కృషి



సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ అజిత

భీమవరం: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. గురువారం సార్వత్రిక ఎన్నికల విధులకు జిల్లాకు వచ్చిన కేంద్ర సాయుధ బలగాలు, నాగాలాండ్ పోలీసు అధికారులతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గొడవలు, అల్లర్లకు తావు లేకుండా ప్రజలు ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా పూర్తి భద్రత కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి కేటాయించాలని ఎలాంటి రాజకీయ ప్రలోభాలకులోను గాకుండా పూర్తి నిబద్ధత, నిజాయతీతో విధులను నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, అదనపు ఎస్పీ (ఏసీబీ) సౌమ్యలత, ట్రైనీ డీఎస్పీ అరవింద్ పాల్గొన్నారు.

ప్రకటనలకు అనుమతులు తప్పనిసరి

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 12, 13వ తేదీల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు పత్రికల్లో ప్రచురించే ప్రకటనలకు పోటీ చేసే అభ్యర్థులు రెండు రోజులు ముందుగా ఎంసీఎంసీ ధ్రువీకరణ అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. పత్రికల యాజమాన్యాలు కూడా సదరు ఎంసీఎంసీ ధ్రువీకరణ ముందస్తు అనుమతి లేకుండా తమ పత్రికల్లో రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రకటనలు ప్రచురించరాదని కోరారు.

దేవదాయ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

భీమవరం: దేవదాయశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని సొమ్ములు తీసుకుని మోసం చేశాడంటూ గంటా నాగసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని మెంటేవారితోట బంత్రోతులవారివీధికి చెందిన నాగసూర్య నుంచి పట్టణంలోని నల్లంవారితోట ప్రాంతానికి చెందిన సంకు సత్యనారాయణ దేవదాయశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తిరిగి డబ్బులు ఇవ్వలేదంటూ నాగసూర్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.


వజ్రాలు తరలిస్తున్న వాహనం సీజ్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సత్యకిషోర్

భీమవరం అర్బన్: మండలంలోని లోసరిలో జాతీయ రహదారిపై జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం సీఐ వై.సత్యకిషోర్ వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వజ్రాలు, బంగారాన్ని తరలిస్తున్న వాహనాన్ని సోదా చేసి సీజ్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి జిల్లా వైపు వస్తున్న వ్యాన్‌ను పోలీసులు తనిఖీ చేయగా అందులో 175 గ్రాముల వజ్రాలు, 2.50 కిలోల బంగారం, 5 కిలోల వెండికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఆర్డీఓ శ్రీనివాసులురాజుకి సమాచారం అందించారు. తనిఖీల్లో రూరల్ ఎస్సై జి.రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉల్లి ఎగుమతుల్లో రికార్డు



కురెళ్ల సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: ఉల్లి ఎగుమతుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో పట్టణానికి చెందిన ఉల్లిపాయల ఎగుమతిదారు కురెళ్ల సత్యనారాయణ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయనకు చెందిన నవీన్ ఇంపెక్స్ కంపెనీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. జాతీయ స్థాయిలో 16వ స్థానం, తెలుగు రాష్ట్రాల్లో తొలి స్థానంలో నిలిచింది. ఈ ఘనతను సాధించిన సత్యనారాయణను పలువురు అభినందించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజుకు మద్దతు తెలుపుతున్న పెనుగొండ బైపేవారిపేట మహిళలు

పెనుగొండ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఇలపర్రుకు చెందిన 50 ఎస్సీ కుటుంబాలు తూర్పుపాలెంలోని కార్యాలయంలో శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాల కప్పి ఆహ్వానించారు. రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ప్రతిఒక్కరూ కృషి చేసి అత్యధిక మెజార్టీ సాధించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో యార్లగడ్డ ఆనంద్‌రావు, నేదునూరి దుర్గారావు, నేదునూరి సత్తిబాబు, దిగమర్తి చిన్నబాబు, నేదునూరి వెంకటేశ్వరరావు, వసంతాడ నాని, యార్లగడ్డ దుర్గారావు, నేదునూరి వెంకటేష్, ఎల్లవేరపు గణేష్, నేరేడుమిల్లి ఏడుకొండలు, నేదునూరి మనీ, నేదునూరి మంగతాయారు, నేదునూరి ధనలక్ష్మి, నేదునూరి మంగ, నేదునూరి నాగమణి, ఎల్లవేరపు శాంతి కుమారి ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దిద్దే శీను, జీవ, బోసిబాబుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజుకు మద్దతు తెలిపిన బైపేవారిపేట మహిళలు

రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉంటామంటూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు పెనుగొండ బైపేవారి పేట మహిళలు మద్దతు పలికారు. గురువారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీరంగనాథ రాజును కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కొడమంచిలి ఉష, అభహారు సొదామని, శకుంతల, తానేటి పద్మ, తానేటి షర్మిల, నక్క నాగమణి, యార్లగడ్డ యోదేష్, తానేటి విజేత, దగ్గుమేటి నాగమణి, దగ్గుమేటి సరోజని, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, సుంకర నాగాబాబు, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, గాజుల బులి పుల్లారావు, కుడిపూడి సుబ్రహ్మణ్యం, తిక్కిరెడ్డి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం సీతా పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: పోలింగ్ ముగిసిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్‌లకు ఎన్నికల నిబంధనలు, ప్రొటోకాల్ ప్రకారం పూర్తి భద్రతతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం భీమవరంలోని సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసే ఆచంట నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లను ఆయన పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్స్ తరలించేందుకు ముందుగానే రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకోగానే ముందుగా రిసెప్షన్ సెంటరుకు అప్పజెప్పాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు వచ్చే మార్గం, చట్టుపక్కల శాంతిభద్రతల పరిరక్షణపై ఆరా తీశారు. బస్ రూట్లు, వాహన పార్కింగ్, పోలింగ్ సామగ్రిని తీసుకునే స్టాల్స్, బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు భద్రపరచు స్ట్రాంగ్‌రూమ్‌లు, మైక్రో అబ్జర్వర్లు వేచి ఉండే గదులు, భోజన స్టాల్స్, కౌంటింగ్ హాలులో సీసీ కెమెరాల ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్స్ కౌంటింగ్ హాలు, ఫలితాల బోర్డు ఏర్పాటు, పోలీస్ కంట్రోల్‌రూమ్ తదితర పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. ఆచంట నియోజకవర్గ ఆర్వో వి.స్వామినాయుడు, తహసీల్దార్ ఐపి శెట్టి ఆయన వెంట ఉన్నారు.

అధికారులూ.. అప్రమత్తంగా ఉండాలి

భీమవరం(ప్రకాశంచౌక్): ఎన్నికలకు మరో 72 గంటలు సమయం ఉన్నందున ఎన్నిక ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆర్వోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన గూగుల్ మీట్ ద్వారా సూచనలు జారీ చేశారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు 24 గంటలు అప్రమత్తంగా పనిచేయాలని, గ్రామాల్లో నగదు, మద్యం, బహుమతుల పంపిణీకి అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచార లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు జెడ్.వెంకటేశ్వరరావు, ఎం.మోహనరావు, యు.మంగపతిరావు, ఆర్.విక్టర్, కె.జాషువా పాల్గొన్నారు.

48 గంటల ముందే మద్యం దుకాణాల బంద్

ఉండి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న పోలింగ్‌కు 48 గంటల ముందు జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలు బంద్ చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం విక్రయాలపై నిషేధం విధించారన్నారు. అలాగే వచ్చేనెల 4న కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలను జూన్ 3న సాయంత్రం సాయంత్రం నుంచి 4న సాయంత్రం 7 గంటల వరకు మూసి ఉంచాలన్నారు.

13,656 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో గురువారం వరకు 13,656 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా గురువారం ఆచంటలో 28 మంది, పాలకొల్లులో 30 మంది, నరసాపురంలో 37 మంది, భీమవరంలో 255 మంది, ఉండిలో 34 మంది, తణుకులో 32 మంది, తాడేపల్లిగూడెంలో 63 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారన్నారు. శుక్ర, శనివారాల్లో కూడా సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయవచ్చన్నారు.

నరసాపురానికి తొలి మహిళా ఎంపీ అవుతా..



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

ధనబలం కన్నా జనబలం గొప్పదని నమ్మి జగనన్న నాకు ఈ అవకాశం ఇచ్చారు. ఐదేళ్ల ప్రజారంజక పాలన, ప్రజల ఆదరాభిమానాలే నాకు అఖండ విజయాన్ని అందిస్తాయి. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో సరికొత్త చరిత్రను లిఖిస్తాం.. అని అన్నారు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల. నరసాపురంలో తొలి మహిళా ఎంపీ తానే అవుతానని, అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దామంటున్న ఉమాబాలతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.. – సాక్షి, భీమవరం

సాక్షి : మీ కుటుంబ నేపథ్యం ?

ఉమాబాల : నేను భీమవరంలోనే పుట్టి పెరిగాను. 10వ తరగతి వరకు లూథరన్ హైస్కూల్, ఇంటర్, డిగ్రీ డీఎన్నార్ కళాశాలలో చదివాను. డీఎన్నార్‌లో లా కోర్సు ప్రారంభించిన మొదటి బ్యాచ్‌లోనే గోల్డ్‌మెడల్ సాధించాను. నా భర్త జగదీష్‌కుమార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేశారు. మా అబ్బాయిలు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు.

సాక్షి: రాజకీయాల్లోకి ఎలా వచ్చారు ?

ఉమాబాల: నా తండ్రి పంపన చంద్రశేఖరరావు ప్రోద్బలంతో 1995లో రాజకీయాల్లోకి వచ్చాను. టీడీపీకి కంచుకోటైన 31వ వార్డులో కాంగ్రెస్ పార్టీ మెంబర్‌గా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందాను. 2000లో భీమవరం మున్సిపాలిటీకి ప్రత్యక్ష పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో చైర్‌పర్సన్‌గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందాను. తర్వాత జిల్లా మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పనిచేశాను.

సాక్షి : వైఎస్సార్‌సీపీలో మీ ప్రస్థానం ?

ఉమాబాల: మేము దివంగత వైఎస్సార్ అభిమానులం. ఆయన మరణానంతరం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావానికి ముందు నుంచి జగనన్న వెంటే ఉన్నాం. పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా, జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఉన్నాను. జిల్లాలో సీఎం జగన్ ఓదార్పు యాత్ర, పాదయాత్రల విజయవంతానికి కృషి చేశాను.

సాక్షి: ఎంపీగా పోటీ చేసే అవకాశంపై మీ అభిప్రాయం ?

ఉమాబాల: ఇది జగనన్న ఇచ్చిన వరం. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, మహిళా సాధికారతలో ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. ఇంతకాలం నరసాపురంలో ఆర్థికంగా బలమైన అభ్యర్థులకే రాజకీయ పార్టీలు అవకాశం ఇచ్చేవి. తొలిసారిగా జగనన్న సామాన్య కుటుంబానికి చెందిన బీసీ మహిళనైన నాకు అవకాశం ఇచ్చి సామాజిక న్యాయం అంటే ఏంటో చూపించారు.

సాక్షి: నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంపై మీ అవగాహన ?

ఉమాబాల: పూర్తి అవగాహన ఉంది. స్థానిక పరిస్థితులు, ప్రజల అవసరాలు తెలుసు. గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా అంతటా ప్రచారం చేశాను.

సాక్షి: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది ?

ఉమాబాల: చాలా బాగా సాగుతోంది. మూడు నెలలుగా ప్రజల్లోనే ఉన్నాను. గతంలో ఎంపీ అభ్యర్థులు ప్రచార రథం నుంచి అభివాదం చేస్తూ ర్యాలీగా వెళ్లిపోయేవారే తప్ప ప్రజల వద్దకు వెళ్లి పలకరించేవారు కాదు. నేను అలా కాదు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులందరితో కలిసి డోర్ టూ డోర్ ప్రచారం, ర్యాలీలు, ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొంటున్నాను.

సాక్షి : ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది ?

ఉమాబాల: ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోంది. బీసీ వర్గాలతో పాటు ఉన్నత వర్గాల్లోనూ మా కుటుంబానికి మంచి పేరు, సత్సంబంధాలు ఉన్నాయి. వర్గాలకు అతీతంగా ఇంటి బిడ్డలా ఆదరిస్తూ అక్కున చేర్చుకుంటున్నారు.

సాక్షి: విజయానికి దోహదం చేసే అంశాలు ?

ఉమాబాల: జగనన్న సంక్షేమ పథకాల అమలు, పార్టీలకతీతంగా పేదరికమే ప్రామాణికంగా అందిస్తున్న వైనం, మేనిఫెస్టోలో ఆచరణ సాధ్యమైన అంశాలతో ప్రజల మనసులు గెలుచుకున్నారు. జగన్ చెప్పారంటే చేస్తారని ప్రజల విశ్వాసం. ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలతో పాటి ఇవ్వని పథకాలు కూడా అమలు చేసి చూపించారు. పార్టీ శ్రేణులు, ప్రజల ఆదరాభిమానాలు నాకు అఖండ విజయాన్ని అందిస్తాయి.

సాక్షి: కూటమి మేనిఫెస్టోపై మీ అభిప్రాయం ?

ఉమాబాల: ప్రజలు విజ్ఞతతో ఆలోచిస్తారు. చంద్రబాబు హామీలు ఎలా అమలుచేస్తారో అందరికీ తెలుసు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి ఐదేళ్లలో జగనన్న అమలుచేసిన హామీలను కాపీ కొట్టడం సిగ్గుచేటు. వలంటీర్లను నానా మాటలు అని.. ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామంటున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో మరోసారి మోసగించేందుకు మేనిఫెస్టోతో ముందుకు వస్తున్నారని కూటమిని ప్రజలు చీదరించుకుంటున్నారు.

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధికి మీరు చేసే కృషి ?

ఉమాబాల: గతంలో ఎన్నికైన ఎంపీలు స్థానికంగా నివాసం ఉండేవారు కాదు. నేను భీమవరంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటాను. వశిష్ట వారధి, ఆక్వా వర్సిటీ, ఫిషింగ్ హార్బర్, కోటిపల్లి రైల్వే లైను త్వరితంగా పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తాను. పాలకొల్లులో వైద్య కళాశాల పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరిగేలా కృషి చేస్తాను. కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలకు స్థలాలు, రోడ్లు, తాగునీరు, సాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. ఆక్వా రంగం అభివృద్ధికి, ఆక్వా కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటాను. విపత్తుతో పాడైన ధాన్యం విషయంలో రైతులకు మేలు జరిగేలా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తాను. గతంలో ఎక్సలెన్సీ నిధులను ప్రతిపాదనలకే పరిమితం చేశారు. వాటిపై కేంద్రంతో పోరాడి మంజూరుకు కృషి చేస్తాను.

- ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నిర్ణయంతో తీవ్ర వ్యతిరేకత
- పశ్చిమగోదావరిలో కూటమి అభ్యర్థులకు ఎదురుగాలి
- బీజేపీతో పొత్తుతో టీడీపీ, జనసేన నేతల్లోనూ ఆందోళన
- జగన్ ప్రభుత్వంలో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో లబ్ధి

హమారా జగన్



భీమవరంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలతో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

భీమవరం : ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నిర్ణయం పశ్చిమగోదావరి జిల్లాలో కూటమికి ఎదురుదెబ్బ తప్పేలాలేదు. టీడీపీ, జనసేనతోనే గాకుండా బీజేపీతో పొత్తు లాభం కంటే నష్టమే ఎక్కువని టీడీపీ, జనసేన నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీకి మద్దతు పలికిన ముస్లింలు సైతం బీజేపీతో అంటకాగే టీడీపీ, జనసేనకు దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. దీంతో జిల్లాలో ముస్లిం ఓట్లు ఎక్కువగా ఉన్న భీమవరం, నరసాపురం, ఆకివీడు, పాలకొల్లు తణుకు తదితర ప్రాంతాల్లో కూటమి అభ్యర్థుల గెలుపుపై తీవ్ర ప్రభావం చూపనుంది. గతంలో టీడీపీ ఒకసారి వాజ్‌పేయి, మరోసారి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుని ముస్లింలకు చేసిందేమి లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరలా బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే దేశంలో ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్న బీజేపీని ఎలా ఎదుర్కొంటారని ప్రశ్నిస్తున్నారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమంటూ బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డీఏ అధికారంలోనికి వచ్చిన తరువాత ముస్లింలకు నష్టం తప్పదని, అలాంటి మతతత్వ బీజేపీ పంచన చేరిన చంద్రబాబును ఎలా నమ్మాలని, చంద్రబాబు గత పాలనలోనూ ముస్లింలు అడుగడుగునా వివక్షకు గురయ్యామని ముస్లిం పెద్దలు ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీతోనే మైనార్టీల సంక్షేమం

రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికపరంగా వెనుకబాటులో ఉన్న ముస్లిం మైనార్టీలను మహానేత వైఎస్సార్ తరువాత వైఎస్ జగన్ మోహనరెడ్డి ఉన్నతంగా ఎదిగేలా చేశారు. నాలుగు శాతం రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముస్లింలు లబ్ధి పొందారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్, ఎక్కువ మందికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ముస్లింలకు అవకాశం దక్కింది. పట్టణాలు, గ్రామాల్లో సైతం ముస్లింలకు అనేక పదవులు దక్కాయి. ముస్లింల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకమైన శ్రద్ధ చూపించడంతో ఇటీవల కాలంలో వైఎస్సార్ సీపీలో ముస్లింల చేరికలు గణనీయంగా పెరిగాయి. మతతత్వ బీజేపీతో జతకట్టిన టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలనే నిర్ణయానికి ముస్లిం సంఘాలు వచ్చాయని చెబుతున్నారు.

ముస్లింల సంక్షేమానికి జగన్ పెద్దపీట



గతానికి భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోంది. ముస్లింల సంక్షేమానికి జగన్ పెద్దపీట వేశారు. సామాన్యులను సైతం పెద్ద పదవులు వరిస్తున్నాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటి పదవులతోపాటు నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు న్యాయం జరిగింది. అందుకే మేమంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నాం.

– ఎండీ అలీ, ఆకివీడు

రిజర్వేషన్లు మతపరమైనవి కావు



ముస్లింలకు కల్పిస్తున్న 4 శాతం రిజర్వేషన్ మతపరమైనవి కావు. ఈ విషయాన్ని బీజేపీతో పాటు ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కూడా తెలుసుకోవాలి. ముస్లింలలో నిమ్న కులాలవారికి మాత్రమే ఆ రిజర్వేషన్లు వర్తిస్తున్నాయి. ముస్లింలకు ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లను తాము కొనసాగిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం ఆనందదాయకం.

– ఎస్‌కే ఖాదరవల్లి, ఆకివీడు

బాబుకు ముస్లింలంటే గిట్టదు



బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు ముస్లింలంటే ద్వేషం. రిజర్వేషన్ల ద్వారా ముస్లింలు లబ్ధి పొందడం వారికి ఏమాత్రం ఇష్టం లేదు. బీజేపీతో ఎన్నికల్లో జతకట్టిన చంద్రబాబుకు కూడా ముస్లింలంటే గిట్టదు. ముస్లిం ద్వేషి అయిన కూటమికి ఈ ఎన్నికల్లో ముస్లింలు బాగా ఆలోచించి ఓటు వేయాలి. సైకిల్, గాజుగ్లాసుకు ఓటేస్తే ముస్లింల రిజర్వేషన్ రద్దుకు మద్దతిచ్చిన వారమవుతాం.

– ఎండీ అబేదాసుల్తానా, నరసాపురం

రిజర్వేషన్లకు ముప్పు తేవద్దు



బీజేపీ అంటే సహజంగానే ముస్లింలు అభద్రతాభావంతో ఉంటారు. బీజేపీ నాయకులు ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ బహిరంగంగానే చెబుతుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ పార్టీతో జతకట్టిన ఇతర పార్టీలను ముస్లింలు నమ్మడం కష్టం. బడుగు బలహీన వర్గాలకు చెందిన ముస్లింల అభ్యున్నతికి పాటు పడేవారికే మేము మద్దతిస్తాం.

– ఎస్‌కే బాషా, నరసాపురం

ముస్లింలను వైఎస్ ఆదుకున్నారు



వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఆదుకున్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ కూడా మా సంక్షేమానికి పాటు పడుతున్నారు. ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కొనసాగిస్తామని జగన్ స్పష్టంచేయడం ఆయనకు మైనార్టీలపై ఉన్న అభిమానానికి నిదర్శనం.

– ఎస్‌కే వలీబాబు, నరసాపురం



లోకేష్ శ్రీహర్షను అభినందిస్తున్న శశి వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ

పాలిసెట్‌లో సత్తా చాటిన 'శశి'

ఉండ్రాజవరం: పాలిసెట్–2024 ఫలితాల్లో శశి వేలివెన్ను క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు స్టేట్ మొదటి ర్యాంకుతో పాటు ఉత్తమ ర్యాంకులతో తమ విద్యాసంస్థ ప్రతిభను చాటారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ గురువారం చెప్పారు. కుమ్మరపురుగు లోకేష్ శ్రీహర్ష 120 మార్కులకు 120 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారన్నారు. కాకర్ల శ్రీసాయినాథ్, రెడ్డి జీవన్, సిరిమల్ల లక్ష్మి తనుష్క, గుడ్ల సాహితి 119 మార్కులతో స్టేట్ 7వ ర్యాంకుతో పాటు కె.ప్రేమ్‌కుమార్, ఆకుల శ్యామ్ కృష్ణ స్టేట్ 14వ ర్యాంకు, నీల వర్షిత స్టేట్ 21వ ర్యాంకు సాధించారన్నారు. 10 లోపు 5 ర్యాంకులు, 50 లోపు 9, 100లోపు 21, 200 లోపు 36, 500లోపు 62, 1,000లోపు 97 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను శశి విద్యాసంస్థ చైరరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

చంద్రబాబుకు మాలలు బుద్ధి చెప్పాలి

భీమవరం: మాలమహానాడు నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టించి, మాలమహానాడు ఉద్యమాన్ని నీరుగార్చిన చంద్రబాబుకు ఎన్నికల్లో మాలలు బుద్ధి చెప్పాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లీ మంగరాజు కోరారు. గురువారం భీమవరంలో మాట్లాడుతూ మాలలందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నారన్నారు. అబద్ధాల ముసుగేసుకుని వస్తున్న చంద్రబాబు, మందకృష్ణ మాటలను మాల, మాదిగలు నమ్మవద్దని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

క్లుప్తంగా

పాలిసెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


టేకు కుమార్ శ్రీసత్యసాయి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 45మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ బీ.రాజారావు గురువారం తెలిపారు. 50వేల లోపు 15మంది, లక్ష లోపు 45మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. 50వేల లోపు టేకు కుమార్ శ్రీసత్యసాయి 4437వ ర్యాంకు, కే.హేమంత్ 13,029, సీహెచ్.అభిషేక్ 20,741, ఎంవి.సతీష్ 24,572వ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్, ఉపాధ్యాయులు ఆనంద్, బాలాజీ, కృష్ణ, రవి తదితరులు అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: తణుకు వేల్పూరు రోడ్డులోని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తణుకు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఇన్సూరెన్స్ కార్యాలయంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యుల వైద్యసేవలతోపాటు జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా అందజేస్తామని వివరించారు. వైద్య సేవలు అవసరమైన వారు ఈ శిబిరానికి హాజరై వైద్యసేవలు పొందాలని కోరారు.

సూరంపూడిలో నాటుసారా స్వాధీనం


నాటు సారా స్వాధీనం చేసుకున్న ఎస్‌ఈబీ అధికారులు

తణుకు: ఇరగవరం మండలం సూరంపూడి గ్రామంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం దాడి చేసి అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన బొల్లా నాగదుర్గాప్రసాద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 5 లీటర్లు నాటుసారా, 100 లీటర్లు బెల్లపు ఊటను స్వాధనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ నిఘా విభాగం ఎస్సై అడబాల సతీష్, తణుకు ఎస్సై వెంకటేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులందరికీ అండగా ఉంటా

రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


తణుకులో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: రాష్ట్రంలో చదువుల విప్లవాన్ని తీసుకువచ్చి పేద, దిగువ మధ్య తరగతి వర్గాల పిల్లలందరిని బడిబాట పట్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు బార్ అసోసియేషన్ భవనంలో బుధవారం నిర్వహించిన న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందనే విషయాన్ని ఆచరణలో పెట్టి చూపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జూనియర్ న్యాయవాదులకు పారితోషికంగా నెలకు రూ. 5వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తోందని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి వారికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. తణుకు బార్ అసోసియేషన్ భవనానికి అవసరమైన ఏసీలు సరఫరా చేస్తానని, పై అంతస్తు భవన నిర్మాణానికి అవసరమైన నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. తణుకు నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధిగా ఎవరు అయితే మీకు అందుబాటులో ఉంటారో, ఎవరినైతే ఎటువంటి సిఫార్సులు లేకుండా నేరుగా కలువవచ్చో గ్రహించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో భాగంగా సీఎం జగన్ పారితోషికాన్ని అందజేస్తున్నారని, న్యాయవాదులందరికీ తెలుపు రంగు రేషన్ కార్డులు వైఎస్సార్ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఈదా రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగార్జున దాస్, కోశాధికారి మృత్యుంజయ రావు, అసోసియస్ నాయకులు ప్రతాప్, కె.శ్రీను, బలిజేపల్లి రవిశంకర్, చోడే గోపికృష్ణ, పొట్ల సురేష్, రవి సిన్హా, అడ్డాల బాబ్జి పాల్గొన్నారు.


తేతలిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

అందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తాం

తణుకు టౌన్: రాబోయే కాలంలో పేదలందరికీ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి స్థలాలు అందజేస్తామని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి తణుకు మండలం మండపాక గ్రామం నుంచి పైడిపర్రు మీదుగా తేతలి వరకు ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. అనంతరం తేతలి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల సభలో మంత్రి కారుమూరి మాట్లాడారు. పేదల పిల్లలు నాణ్యమైన విద్యను అందించేందుకు నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశారని వాటి ద్వారా లబ్ధి పొందేందుకు మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పేదల అభివృద్ధి కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ రాబోయే కాలంలో రెట్టింపు చేసి అమలు చేస్తామని చెప్పారు. చంద్రబాబు పేదల పట్ల యముడులా తయారై రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పేద విద్యార్థులకు విద్యా దీవెన వంటి పథకాలకు నిధులు విడుదల చేయకుండా అడ్డుకున్నారన్నారు. మండపాక గ్రామంలోని పలు వీధుల గుండా పైడిపర్రు, తేతలి గ్రామాల్లో సాగింది. మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, తేతలి గ్రామ కమిటీ అధ్యక్షులు కోట నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు వై.విజయమూర్తి, పి.సతీష్‌కుమార్‌రాజు, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, నాయకులు, కోట స్వామీజీ, దారం శ్రీను, భూపతిరాజు రామకృష్ణంరాజు, పెండ్యాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

తణుకు అర్బన్: తణుకు పట్టణం 2వ వార్డులో బుధవారం రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కోడలు కీర్తి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నమ్మకానికి నిదర్శనంగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి మీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, సంగిరెడ్డి శ్రీనివాస్, రంభ నాగేశ్వరరావు, పెంటా నరేష్, నందాపు దుర్గారావు, బొద్దాని శ్రీనివాస్, బొద్దాని బాలమురళీకృష్ణ, కర్రి గంగాధర అప్పారావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

తణుకు అర్బన్: ఇంటి గుమ్మంలోకి పింఛను రావాలన్నా, ఇంటి గడపలోకి సంక్షేమం అందాలన్నా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. తణుకులో ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తణుకు శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న సంచారజాతులతో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సంచార జాతుఅ సంఘ అధ్యక్షుడు చందూరి నాగరాజు, కారుమంచి ఫౌండేషన్ అధ్యక్షుడు కారుమంచి యోహాన్, దేవరకొండ అభిషేక్, అభసాని కోటయ్య, రామారావు, సాక్షి నాయుడు, ఖైరాజు తదితరులు పాల్గొన్నారు.


తణుకులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి కోడలు కీర్తి


తణుకులో ప్రజలతో మాట్లాడుతున్న పెండ్ర వీరన్న

అత్తిలి: సంక్షేమ పాలన అందజేస్తున్న వైఎస్సార్ సీపీని గెలిపించుకోవడం ద్వారా భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నేలపాటి సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నవరత్నాలతో అన్ని వర్గాలకూ మేలు


కుంచనపల్లి గ్రామంలో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: నవరత్నాలు పథకాల ద్వారా అన్నివర్గాలకూ మేలు చేకూరిందని తాడేపల్లిగూడెం సొసైటీ చైర్మన్ గుమ్మళ్ళ తాతారావు అన్నారు. గురువారం మండలంలోని కుంచనపల్లి, కృష్ణాయపాలెం, బంగారుగూడెం, నీలాద్రిపురం, మెట్ట ఉప్పరగూడెం, కొమ్ముగూడెం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుంచనపల్లి గ్రామంలో తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సీఎం జగన్ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారన్నారు. జగన్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తిరిగి ఆయనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ నెల 13వ తేదిన జరగనున్న ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థికొట్టు సత్యనారాయణ, పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను సీలింగ్ ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, కంఠమణి సత్యనారాయణ, తాడేపల్లి మోషే, కనుపూరి ఉదయభాస్కర్, ఉర్ల నవీన్, నక్కా గంగాధర్, గజ్జరపు రామకృష్ణ, పుట్టా ఉమామహేశ్వరరావు, చంద్రు శ్రీనివాస్, కొండుబోయిన కృపావరం, కొండుబోయిన ఏసుటోని, నూనె రాధాకృష్ణకుమారి, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, చిన్నం సురేష్, ముప్పిడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత


అప్పారావుపేట గ్రామంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణ అందరి సామాజిక బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఆరోగ్య సర్వే, ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కూలర్లు, కుండీలు వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిలో దోమలు లార్వాలను ఏర్పాటు చేసి, దోమలవృద్ధికి కారణం అవుతాయన్నారు. దోమల లార్వాలను గుర్తించి, వాటిని నాశనం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. ఆరోగ్య కార్యకర్తలు బేబి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, భాస్కరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొట్టు విజయం కోరుతూ నాని ప్రచారం


డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విజయం కోసం ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈలి నాని

తాడేపల్లిగూడెం: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో డిప్యూటీసీఎం, వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ విజయం కోరుతూ గురువారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే ఈలి నాని విస్తృత ప్రచారం చేశారు. నియోజకవర్గం పురోభివృద్ధి బాటన నడవాలంటే మళ్లీ కొట్టునే ఎన్నుకోవాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఘన విజయం అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు విజయ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

పెంటపాడు: వైఎస్సార్ ప్రభుత్వం ద్వారానే జగనన్న సంక్షేమ, అభివృద్ధి పాలన మళ్లీ రానుందని, ప్రజలు తప్పక జగనన్నను సీఎంగా చేసేందుకు కృషి చేయాలని పెంటపాడు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పెంటపాడులో చేస్తున్న ప్రచారం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీపీ దాసరి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, దేవాబత్తుల నాగమణి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ తదితరులు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి అంజిరెడ్డి, నల్లమిల్లి గాంధీరెడ్డి, బండారు నాగు, బస్సుల రెడ్డి, ఆడిటర్ దాసరి శ్రీనివాస్, శివా రెడ్డి, పాలూరి సాయిరాం, యూత్ అధ్యక్షులు కొవ్వూరి బాస్కరరెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఏఎంసీ డైరెక్టర్లు సలుమూరి ప్రకాష్, కర్రి వరహాలరెడ్డి, కర్రి ప్రియాంకరెడ్డి చదలవాడ శ్రీనివాస్, బండారు రాంబాబు, ఉండ్రాజవరపు గోపి, రెడ్డి సంఘ సభ్యులు, నల్లమిల్లి అప్పిరెడ్డి, బర్ల జయరాంబాబు, ఎస్సీ, బీసీ సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా పాలకొల్లును మారుస్తా



సాక్షితో వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)



క్షీరపురి.. కళలకు, కళాకారులకు నిలయంగా పేరుగాంచినా విలక్షణంగా ఇచ్చే ఓటర్ల తీర్పులకు అంతకంటే ప్రసిద్ధిగాంచింది. కాపుల ఖిల్లాగా పేరొందినా.. సినీ పరిశ్రమకు చెందిన ఉద్ధండులు పోటీ చేసినా ఇక్కడి ఓటర్లు ఇచ్చే మెస్సేజ్ ఓ రేంజ్‌లో ఉంటుంది. రాజకీయాల్లో ఎవ్వరి డ్రామాలూ ఇక్కడ సాగనివ్వరు. గత పదేళ్లుగా నిమ్మల వేస్తున్న డ్రామాలను సైతం ఇక్కడి ప్రజలు ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు. గోరంత చేస్తే కొండంత ప్రచారం చేసుకునే ఆయన జోరుకు బ్రేక్ వేస్తారని అంటున్నారు. తనకు కల్లబొల్లి మాటలతో డ్రామాలు, నాటకాలు ఆడే అలవాటు లేదని.. తనను గెలిపిస్తే పట్టణంలో ప్రధానంగా ఉన్న దమ్మయ్యపతి మురుగుకోడు పనులు పూర్తిచేస్తానని.. విలీన గ్రామాల సమస్యలను పరిష్కరిస్తానని.. క్షీరపురి వైభవానికి మరింత ప్రాముఖ్యత తీసుకురావాలనే సంకల్పంతో ప్రణాళికలను సిద్ధం చేసుకున్నానని చెబుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అంతరంగం ఆయన మాటల్లోనే...

- పాలకొల్లు సెంట్రల్

సాక్షి: వ్యాపారం నుంచి రాజకీయ రంగంలోకి ఎలా వచ్చారు?

గుడాల శ్రీహరి గోపాలరావు: వ్యాపారంలో కష్టపడి ఎదిగా. ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు లేవు. వ్యాపార రంగంలో ఉన్నప్పుడే నా వంతు సేవా కార్యక్రమాలు చేయడం నాకు తృప్తినిచ్చేది. బంధువులు, స్నేహితులు రాజకీయాల్లో చేరితే ప్రజలకు మరింత సేవలందించవచ్చని సూచించారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందనే రాజకీయాల్లో అడుగుపెట్టా.

సాక్షి: మిమ్మల్నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడంపై మీ అభిప్రాయం?

గుడాల శ్రీహరి గోపాలరావు: పాలకొల్లు నియోజకవర్గంలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేయాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. ఆయన సంకల్పం వల్ల నాకు ఈ అవకాశం లభించడం చాలా సంతోషాన్నిచ్చింది.

సాక్షి: ప్రతిపక్ష నాయకులు మీరు వలస నాయకులని అంటున్నారు. దీనిపై మీ కామెంట్స్?

గుడాల శ్రీహరిగోపాలరావు: నా స్వగ్రామం వీరవాసరం మండలం వీరవాసరం గ్రామం. 2014 ఎన్నికలకు ముందు వీరవాసరం మండలం ఏ నియోజకవర్గంలో ఉందో ప్రతిపక్షాలు తెలుసుకోవాలి. విభజనలో భాగంగా నియోజకవర్గం మారిందే తప్ప మేము మారలేదు కదా. అంత లోకల్ ఫీలింగ్ ఉన్న ఎమ్మెల్యే నిమ్మల అతని విద్యాభ్యాసం కోసం విశాఖపట్నం, ఉద్యోగం కోసం నరసాపురం ఇలా పక్క నియోజకవర్గాలకు వలస వెళ్లకుండా ఉండాల్సింది. నోటికి ఏదొస్తే అది మాట్లాడేస్తే ప్రజలు నమ్మేస్తారనుకోవడం అతని అవివేకం.

సాక్షి: అభివృద్ధి అంటే రామానాయుడు అంటున్నారు. మీరేం అంటారు?

గుడాల శ్రీహరిగోపాలరావు: ఆ ప్రచారం అతనికి అతను చేసుకునేదే. అభివృద్ధి అంటే నిరంతర ప్రక్రియ. గతంలో ఈ నియోజకవర్గం నుంచి ఎంపికైన ప్రజాప్రతినిధులు ఎంతో అభివృద్ధి చేశారు.. కాబట్టే నియోజకవర్గం ఇలా ఉంది. ఏ ఒక్కడివల్లో ఏది అవ్వదు. కాకపోతే నిమ్మల రూపాయికి వంద రూపాయలు ప్రచారం చేసుకుంటారు. ఆయన ప్రచార పిచ్చి పరాకాష్టకు వెళ్లింది. ఆ మాటకొస్తే నియోజకవర్గంలో అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల, దాసరి నారాయణరావు డీఎన్నార్ ప్రభుత్వ మహిళా కళాశాల ఇలా నియోజకవర్గంలో ఎంతో మంది ప్రజాప్రతినిధులు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తమ సొంత ఆస్తులు ఇచ్చారు. నియోజకవర్గంలో జగనన్న రూ.475 కోట్లతో శాశ్వతంగా నిలిచిపోయే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇలా గుర్తుండే అభివృద్ధి ప్రాజెక్టు ఏమి చేశారో చెప్పండి. రామానాయుడే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చెప్పమంటారా.... సంక్రాంతి పండుగ వస్తే ఎమ్మెల్యే వాలీబాల్ కప్ అని ఊరంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, 2కె, 5కె రన్ అంటూ ప్రచారం, ట్రీ గార్డ్‌లు అంటూ తన పేర్లు వేయించుకోవడం కాదుకదా అభివృద్ధి అంటే. ఈ కార్యక్రమాలకు కూడా ఎమ్మెల్యే పెట్టిన నగదు ఎంత, వ్యాపారస్తులు, ప్రముఖులు నుంచి సేకరించిన విరాళాలు ఎంత అనేది ఎవరికైనా తెలుసా. దాతలు చందాలు ఇవ్వడం ఏమిటి.. ఇతను ప్రచారం చేసుకోవడం ఏమిటి. అత్త సొమ్ము అల్లుడు దానం అన్నట్లు దాతలు ఇచ్చే సొమ్ములతో ఈ రకమైన పబ్లిసిటీ చేసుకునే నాయకుడిని ఈ నియోజకవర్గంలోనే చూశాను.

సాక్షి: స్థానిక ఎమ్మెల్యే నిమ్మలలో రెండు కోణాలున్నాయని అంటారు. అవి మీకేమైనా కనిపించాయా?

గుడాల శ్రీహరిగోపాలరావు: నిజమే ఎమ్మెల్యే నిమ్మల నియోజకవర్గంలో ప్రజల వద్ద నెమ్మదస్తునిగా నవ్వుతూ నటనా కౌశల్యం ప్రదర్శిస్తారు. అదే నాయకుల వద్ద మరో రకంగా ప్రవర్తిస్తారు. అతను అనుకున్నదే జరగాలి.. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చాలా మంది ఆ పార్టీ నాయకులే చెప్పారు. ఈ పదేళ్లలో అతని పక్కన ఒక్క చిన్న నాయకుడినైనా ఎదగనిచ్చారా...? ఇది నిమ్మల రెండో కోణం. పైకి మాత్రం అందరి వద్ద నటన ప్రదర్శిస్తారు. ఎవరైనా అతనికంటే ఒక్క అడుగు ముందుకేసినా సరే సహించే గుణం అతనిలో లేదు. ఒప్పుకోలేరు కూడా. నియోజకవర్గంలో ఎవరైనా సరే, ఎంత (ఎమ్మెల్సీ వంటి) పెద్ద నాయకుడైనా సరే నిమ్మల వెనకాలే ఉండాలి తప్ప అంగుళం కూడా ముందు వరుసలో ఉండకూడదు.

సాక్షి: మీరు నియోజకవర్గంలో ఎంతవరకూ పట్టు సాధించారు.?

గుడాల శ్రీహరిగోపాలరావు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి సుమారు పది నెలలు కావస్తుంది. నియోజకవర్గంలో ఉన్న పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు (8 గ్రామాలు) మండలాల్లో ప్రజలందరినీ కలుసుకోవడం జరిగింది. జగన్‌కు ఉన్న ప్రజాదరణే నాకు నియోజకవర్గంలో గుర్తింపు తీసుకువచ్చింది. ఒక బీసీ వర్గానికి చెందిన నన్ను నియమించడం పట్ల నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు చూస్తుంటే మాటల్లో చెప్పలేనివి. జగనన్న, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను.

సాక్షి: ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి ఏమి జరిగింది..?

గుడాల శ్రీహరిగోపాలరావు: పట్టణంలో సుమారు 30 వేల మంది జనాభా ఉండగా ఏ నీటి సరఫరా ప్లాంట్ ఉందో.. నేడు లక్ష జనాభా ఉన్న కూడా అదే ప్లాంట్ ద్వారా నీటిని అందించడం జరిగుతుంది. ఈ సమస్య పరిష్కారాన్ని జగనన్న సహకారంతో రూ.15 కోట్ల వ్యయంతో నూతన ఫిల్టర్ ప్లాంట్‌ను ప్రారంభించాము. దీంతో పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. పట్టణంలోని డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కార మార్గం తీసుకువచ్చాం. అలాగే రూ.30 కోట్లతో సుమారు 40 కి.మీ రోడ్లు ఏర్పాటుచేశాము. ముఖ్యంగా రూ.475 కోట్లతో దగ్గులూరులో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాల, రూ.16.60 కోట్లతో పట్టణంలో నూతనంగా నిర్మాణం చేసిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, రూ.10 కోట్లతో సగం చెరువు గ్రామంలో వంతెన నిర్మాణం. నాడు నేడు ద్వారా విద్యా సంస్థల అభివృద్ధి. పేదల సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో రూ.60 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో 135 ఎకరాల భూమి కొనుగోలు చేయడం, 2015లో ప్రారంభించిన మునిసిపల్ అతిథి గృహాన్ని సైతం మేము 2023లో పూర్తిచేశాము. అన్నింటికన్నా ముఖ్యంగా ఒకటి చెప్పాలి. రామానాయుడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేశానని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుండడం చూస్తుంటాము. కాని రామయ్యహాలు ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలకు రోడ్లు, డ్రెయినేజీలు లేవంటే నమ్ముతారా. 2022 వరకూ విద్యుత్ కూడా లేదంటే ఎవరైనా నమ్ముతారా చెప్పండి. ఆ ప్రాంతంలో డ్రెయినేజీ, రోడ్లుతో పాటు విద్యుత్ సరఫరా కూడా మేము ఏర్పాటు చేశాం. ఇవి కాకుండా నియోజకవర్గంలో డీబీటీ ద్వారా 3.94 లక్షల మంది లబ్ధిపొందారు. ఇంత అభివృద్ధి జరిగిన తరువాత ప్రజలు జగనన్నను ఎందుకు మర్చిపోతారు.

సాక్షి: మీరు అధికారంలోకి వచ్చాకా నియోజకవర్గానికి ఏమి చేస్తారు.?

గుడాల శ్రీహరిగోపాలరావు: అభివృద్ధికి చిరునామాగా పాలకొల్లును మారుస్తా. నియోజకవర్గంలో ముఖ్యంగా లోఓల్టేజ్ సమస్య ఉంది. 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకొరకు మూడు ఎకరాల భూమి అవసరం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుగా భూమిని కొనుగోలు చేసి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసిన లోఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తా. పట్టణంలో శివారు ప్రాంతాల విలీన ప్రక్రియ కార్యక్రమం కొందరు స్వార్థ రాజకీయాల వల్ల లీగల్ సమస్యలతో నిలిచిపోయింది. పట్టణాన్ని విస్తరించే పనిలో భాగంగా విలీన గ్రామాల సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తాను. పట్టణంలో అతి ముఖ్యమైన సమస్య ఒకటి ఉంది. సుమారు 14 వార్డుల మురుగునీరు పారుదల అయ్యే దమ్మయ్యపతి మురుగుకోడు పనులు 20 శాతం కమిషన్ల కక్కుర్తితో ఆగిపోయింది. ఆ మురుగుకోడు పనులు పూర్తిచేస్తాం. టిడ్కో గృహాల లబ్ధిదారులైన 6144 మందికి 2500 మందికి గృహాలు ఇవ్వడం జరిగింది. మిగిలిన లబ్ధిదారులకూ గృహాలు పూర్తి చేసి అందజేస్తాము.

సాక్షి: నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే సందేశం?

గుడాల శ్రీహరిగోపాలరావు: జగనన్న అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేయరు. అందుకే సాధ్యమైన సంక్షేమ పథకాలతోనే జగనన్న మేనిఫెస్టో రిలీజ్ చేశారు. 2014లో టీడీపీ మేనిఫెస్టో ఎంతవరకూ అమలు చేశారో ప్రజలకు తెలుసు. 2024లో కూడా టీడీపీ మేనిఫెస్టో మోసపూరితమైన హామీలు గలది అని ప్రజలు గ్రహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాను. నేను కల్లబొల్లి మాటలతో డ్రామాలు, నాటకాలు ఆడలేను. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా. ఏ సమస్య వచ్చినా మీ కుటుంబ సభ్యునిగా వచ్చి అండగా నిలబడతా. మోసపూరితమైన హామీలు, డ్రామాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరుతున్నా.

చదువుల గుడులు



తాడేపల్లిగూడెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల



కొత్తూరు ప్రాథమిక పాఠశాల



ఆకట్టుకుంటున్న స్వాగత ద్వారం



పరిశుభ్రమైన మరుగుదొడ్లు



చేతులు శుభ్రపరుచుకునేందుకు..



విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం



చక్కని తరగతి గది

- ఆహ్లాదకరంగా సర్కారీ బడులు
- కార్పొరేట్‌కు దీటుగా వసతులు
- ఆకట్టుకునేలా డిజిటల్ బోధన

తాడేపల్లిగూడెం: గోడలపై రంగుల బొమ్మలు.. అధునాతన తరగతి గదులు.. చక్కటి బెంచీలు, డెస్కులు, క్రీడా పరికరాలు, ప్రకృతి పర్చినట్టు పచ్చని వాతావరణంలో సరస్వతీ నిలయాలు అలరారుతున్నాయి. అక్షరమాలను నేర్చుకుంటూ.. గుణింతాలను దిద్దుతూ.. పాఠాలను వల్లె వేస్తూ విద్యార్థులు చదువులమ్మ ఒడిలో పరవశించి పోతున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు - నేడు కార్యక్రమంతో విప్లవాత్మక మార్పులతో ఆమూలాగ్రం బడుల రూపురేఖలను మార్చడంతో సాధ్యమైంది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. ఆధునీకరించిన పాఠశాలలను గాలి, వెలుతురు వచ్చేలా ఆరోగ్యకర వాతావరణంలో తీర్చిదిద్దారు. ప్రతి విద్యార్థి బెంచీలపై కూర్చునే విధంగా డెస్కులు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక ద్వారా బ్యాగ్‌లు, బూట్లు, సాక్స్‌లు, నోట్ పుస్తకాలు, బైలింగ్వువల్ పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్‌బుక్స్, యూనిఫాం, బెల్టు ఇస్తున్నారు. మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థులు ఇష్టంగా తినేలా రుచికరమైన పౌష్టికాహారాన్ని రోజుకో మెనూ రూపంలో అమలు చేస్తున్నారు. విద్యార్థులకు అత్యాధునిక మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. మినరల్ వాటర్ అందిస్తున్నారు. డిజిటల్ విద్యను చేరువ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా విద్యను బోధిస్తున్నారు. బైజూస్ కంటెంట్ విద్యను అందచేసేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. తల్లులు పిల్లలను బడికి పంపేలా ఆర్థికంగా ఇబ్బంది లేకుండా అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇకపై మరో రెండు వేల రూపాయలు పెంచి 17 వేలు అందించనున్నారు.

మొత్తం పాఠశాలలు	161
నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసినవి	161
వెచ్చించిన నిధులు రూ. కోట్లలో	32.67
ఉపాధ్యాయుల సంఖ్య	729
విద్యార్థుల సంఖ్య	16,931
2018-19లో విద్యార్థుల సంఖ్య	16,540
2023-24లో విద్యార్థుల సంఖ్య	16,931
పెరిగిన విద్యార్థులు	391





నరసాపురం రూరల్: నరసాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల



తణుకు టౌన్: మండపాకలో ఎన్నికల ప్రచార సభలో అభివాదం చేస్తున్న మంత్రి కారుమూరి

ప్రచార పర్వం

ప్రచార హోరు.. ఫ్యాన్ జోరు

గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి ప్రజాప్రభుత్వానికి పట్టం కట్టాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెనుగొండ: మునమర్రులో వృద్ధుడికి అభివాదం చేస్తున్న ఆచంట అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

జగన్ వల్లే సంచార జాతులకూ గుర్తింపు

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న



నరసాపురం: సంచార జాతులను గుర్తించిన మొట్టమొదటి నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న తెలిపారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ గంగిరెద్దుల, బుడబుక్కల, తోలుబొమ్మలాళ్లు, మందుల, పాములోళ్లు, మొండిబండ, ఓగి, కాటిపాపల, వంశధార్, పిచ్చులగూళ్ల, దేవరపండ్లు ఇలా దాదాపు 54 కులాలకు సంబంధించి రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మంది వరకు ఉంటారని, తమకు ఎలాంటి గుర్తింపు లేకుండా ఉండేవారమని చెప్పారు. తమకు ఓ గుర్తింపు కావాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతున్నా పట్టించుకున్న నాయకులే లేరన్నారు. 2019 ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో మా సమస్యలపై ఆయనకు విన్నవించుకున్నామని, దీంతో ఆయన ముఖ్యమంత్రి అయిన వెంటనే మా సమస్యలపై దృష్టిపెట్టారని తెలిపారు. ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 54 సంచార జాతుల కులాల్లో 32 కులాలను ఈ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఓమందుల కులస్తుడైన నన్ను చైర్మన్‌గా చేశారన్నారు. చంద్రబాబు 2016లో కార్పొరేషన్ ఏర్పాటు అంటూ తూతూమంత్రంగా ఓ జీవో ఇచ్చారని, మూడేళ్లలో రూ 160 కోట్లు విడుదలచేసి కేవలం రూ 40 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన రూ.120 కోట్లు దారి మళ్లించి ఎన్నికల ఖర్చులకు వాడేసుకున్నారని ఆరోపించారు. జగనన్న పాలనలో కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ 50 కోట్లు చొప్పున మా సంచారజాతులకు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అంతే కాకుండా సంక్షేమ పథకాలు అందించడంతోపాటు మా పిల్లలు చదువులకు కుల ధ్రువీకరణ పత్రాలు సైతం అందిస్తున్నారని చెప్పారు.

జగనన్న దీవెనలు ఫలించె



కుటుంబంతో బెల్లంకొండ నరసింహారావు

విద్యా, వసతి దీవెన ఆదుకున్నాయి ■ పిల్లల చదువులు సాఫీగా సాగాయి ■ ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈయన పేరు బెల్లంకొండ నరసింహారావు. ఈయనది నరసాపురం వద్ద సీతారామపురం. పెళ్లయిన తర్వాత ఏదైనా వ్యాపారం చేసుకుందామని అత్తగారి ఊరైన పాలకొల్లు వచ్చారు. చిన్న జిరాక్స్ సెంటర్ పెట్టుకుని జీవితం సాగిస్తున్నారు. అత్తగారింట్లోనే ఉంటున్నారు. ఇద్దరు అమ్మాయిలు. వారి చదువుతో ఖర్చులు పెరిగాయి. ఆదాయం అంతంతమాత్రమే. ఇద్దరమ్మాయిలు కాలేజీ చదువులకు రావడంతో ఖర్చులు భారీగా పెరిగాయి. దీంతో కుటుంబ పోషణకూ ఇబ్బంది పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో ఏమాత్రం ఆసరా లభించలేదు.

జీవితంలో వెలుగు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నరసింహారావు జీవితంలో వెలుగొచ్చింది. పిల్లల చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన ఆసరాగా నిలిచాయి. పెద్ద కుమార్తె వాగ్దేవిశ్రీ బీటెక్ దిగ్విజయంగా పూర్తిచేసింది. చిన్న కుమార్తె సౌజన్యశ్రీ బీఎస్సీ మైక్రో బయోలజీ పూర్తి చేసింది. ఈ రోజు పెద్ద అమ్మాయి హైదరాబాద్‌లో, చిన్నమ్మాయి బెంగళూరులో ఉన్నత ఉద్యోగాలు చేసుకుంటున్నారు. జగనన్న ఇచ్చిన విద్యా, వసతి దీవెనలతో నా పిల్లలు మంచి స్థితిలో ఉన్నారు. ఒక జిరాక్స్ సెంటర్ నడుపుకునే నేను నా పిల్లలను ఇంత మంచి చదువులు చదివించగలిగేవాడిని కాదు. ఇదంతా వైఎస్ జగన్ పుణ్యమే. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.



జిరాక్స్ సెంటర్ నడుపుతున్న నరసింహారావు

విద్యాదీవెన	4,68,000
వసతి దీవెన	1,20,000
రైతు భరోసా	32,000
మొత్తం	6,20,000

– పాలకొల్లు సెంట్రల్

Published and Printed by V Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey no 108/6,Prathipadu Village, Pentapadu Mandal, (West Godavari) and Printed at Jagati Publications Limited Survey no 108/6, Prathipadu Village, Pentapadu Mandal, (West Godavari), Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act), Phone No. 08818 280033. Fax No. 08818 281789 RNI Regn No. APTEL/2008/23807.